

# శుష్క ప్రియాలు-శూన్యహస్తాలు

కథానిక

"మాధవరెడ్డి"

సాయంకాలం ఐదు గంటలు దాటింది-అప్పటికే బీచిలో జనసమ్మర్దం ఎక్కువయింది. అందులో ఆదివారం కావడాన మామూలుకన్నా కొంచెం సందడెక్కువగానే ఉంది. ఒంటరిగా, జంటలుగా, ముఠాలుగా తీరమంతా జనం - అలవాటు ప్రకారం, చంద్రశేఖర్, గౌరీశంకర్ హాస్పటల్ నుంచి బీచికి చేరారు. వాండ్లకది మామూలు-ట్రిప్లికేన్ టెర్మినస్‌లో బస్ దిగి నెమ్మదిగా మెరీనా కాంటీను చేరుకొని, అక్కడ కార్యక్రమం ముగించుకొన్నారు. శంకరం మధ్యమధ్య ఏదో మాట్లాడుతూనే ఉన్నాడు - శేఖర్ అన్నిటికీ ముభావముగా సంజ్ఞలతో జవాబిస్తున్నాడు. శేఖర్‌ను ఆ పరిస్థితుల్లో చూచే వాండ్లకు విపరీతమైన భయ సంకోచాలు రాకమానవు - శంకర్ అలవాటు పడ్డట్టుగా ఉంది అతని వాలకం పరిశీలిస్తే. శంకరం ఏదో శేఖర్‌ను అడిగి తెల్సుకోవాలని కుతూహలంగా ఉన్నాడు ఎన్నాళ్ళనుంచో. దూరంగా దారితీశారు - మౌనంలోనే సాగిపోతున్నారిద్దరూ. ప్రక్కగా కార్పొరేషన్ రేడియో "ఏదిసత్యం, ఏదసత్యం, ఓ మహాత్మా" అంటూ పాడుతూంది. శేఖర్ మాత్రం బరువుగా దిగాలుగా ఉన్నాడు. ఏదో అంతర్గతంగా తర్కించుకుంటూనే చాలదూరంపోయి ఇసుకతిన్నెపై కూర్చున్నారిద్దరూ. చుట్టూ సందడిగానే ఉంది. దీనికి కొంత చిరాకుపడ్డాడు శేఖర్ - ఏకాంత, ప్రశాంతాభిలాషిలా-అంతలో శంకరం మొదలెట్టాడు—

"ఏంరా శేఖర్ నిన్నొక విషయం అడగాలని వుంది, మరి సక్రమంగా జవాబిస్తావా" ముక్తసరిగా జవాబుకోసం నిరీక్షిస్తూ.

"ఊఁ ఎందుకివ్వ" నన్నాడు శేఖర్.

"శేఖర్! మనమిక్కడకొచ్చి దాదాపు ఆరు సంవత్సరాలు, మొదట్లో నీవెంతో హుషారుగా ఉండేవాడివి. రానురాను నీవుమరీ మానసికంగా నీరసించి పోయావు. నీలో భయం, అంతర్గతంగా ఆలోచన ఎక్కువై - ఏకాగ్రతే తక్కువయింది- మాట్లాడలేవు - పలకరిస్తేనే పలుకుతావు - మరి దీనికంతా ఏమైనా కారణం ఉండాలిగా మరి" ఇంతలోనే—

"నీవన్నదంతా నిజమేరా శంకర్, ఇన్ని సంవత్సరాలనుండీ నాలో నేను సతమతమౌతూ సముద్రంలోని కెరటాలతో ఏకాకిగా పోరాడే తప్పిపోయిన నావికుడిలా వుందిరా నా జీవితం - నన్ను చూస్తే నీకు సానుభూతి, ఆదరం కల్గుతున్నాయని తెలుసు. కాని నా గతవిషయాల్ని ఎవరితోటే, ఎప్పటికీ చెప్పుకోను, మళ్ళీ మరికొంత అశాంతిని కొని తెచ్చుకోవడమే అవుతుంది."

"పోరా! ఎప్పుడూ ఏదో మాట్లాడి మాకర్థంగాని ప్రసంగాలతో మమ్మల్ని వేధిస్తుంటావు- నీవు చెప్పుకోకుండా వుంటే మరి ఆ లోలోపలి బాధలకి శాంతెప్పుడు లభిస్తుందిరా! నామీద నమ్మకం, అభిమానముంటే చెప్పరా శేఖర్" అన్నాడు శంకరం తన ఆతురతను అభిమానాన్ని వ్యక్తపరుస్తూ.

ఎలాగో మనసు మార్చుకొని, కొంత సేపటికిలా చెప్పడం ప్రారంభించాడు

శేఖర్ "చెప్తున్నా నువినరా, దాదాపు ఆరేండ్లక్రితం నేను గుంటూరులో బి. ఏ. చదువుతున్న రోజులవి. ఆ సంవత్సరమే మనకు స్వాతంత్ర్యంకూడ వచ్చిందనుకుంటాను. నా కప్పట్లో ఆడవాళ్ళంటే సిగ్గు, బిడియం, దానితో భయం ఉండేదిరా, ప్రత్యేకంగా చదువుకున్న స్త్రీలంటే విపరీతంగా దూరంగా ఉండడానికే సుముఖత చూపేవాడిని. అందుకనే, అప్పుడుండేది, పాపం - ఒకామె- పేరు జ్ఞాపకంలేదు. మేమంతా '421' గానే పిలిచేవాండ్లం- మాక్లాసు మేటు. ఎప్పుడూ నన్ను 'ఫిలాసఫర్' అంటుండేది. నా ముఖభావాన్ని రకరకాలుగా చిత్రించేవారు. అప్పటికి వయసులో కూడ చిన్నవాడినేకదూ, ఇప్పటికంటే ప్రపంచానుభవంకూడా శూన్యం. మార్చిలో పరీక్షలు ముగిశాయి. ఫలితాలువిషయం ప్రసక్తిలేదు. కాని ఈ శెలవులన్నీ ఎలాగడపాలి - తర్వాత కార్యక్రమమేమిటి - అనే ఆలోచన వచ్చింది. ఇలా వుండగా ఏదో "రాజకీయ, సాంస్కృతిక సమావేశాలు ప్రత్యేకంగా యువకులు పాల్గొనాలి-" అనే విషయం పత్రికలద్వారా తెలిసికొని ఎలాగయితేనేం, ఆ ప్రదేశం చేరాను. ఆశ్రమ వాతావరణంలో వుందా సమావేశ నివేశనస్థలం. ప్రక్కగా కాలువ - చుట్టూ కొబ్బరి, అరటి, మామిడితోటలు - పర్ణశాలలాంటి కుటీరాలు. అయితే అన్ని కనీససౌకర్యాలుండేవి. జ్ఞాపకమొచ్చింది, "ఆచార్య కలేల్కర్"గారే ప్రథమం ప్రారంభోపన్యాసం చేశారు - భారత దేశ స్వాతంత్ర్యసమరాన్ని, ఆర్థిక, సాంఘికరంగాల్లో మార్పుల్ని మాకు సమగ్రంగా నివేదించారు. అక్కడ దాదాపు నాలుగు వందలమంది యువకులం చేరాం. స్వాతంత్ర్యానంతరం మేము భావిభారతపౌరులుగా ఎలా జీవించాలో చర్చించాము. అక్కడ అన్నీ ముగిసింతర్వాత గాత్రిళ్లు యువకులలో చర్చజరిగేది. సాయంకాలం ఆ కాలువగట్టునే షికారుకెళ్ళి హాయిగా గడిపేవాళ్లం. త్వరలోనే అందరం స్నేహితులయాం. వివిధభాషలవాండ్లం - విభిన్న ఆచారములతో సమైక్యతతో మెలిగేవాళ్లం. చర్చలో నాకు తెలిసిన విషయాలపై నా అభిప్రాయాల్ని మాత్రం నిరాటంకంగా ప్రకటిస్తూండేవాడిని. మిగతా వాండ్లంతా హర్షిస్తూండేవారు. అందులోవున్న ఆంధ్రయువకులం దాదాపు నలభైమంది ప్రత్యేకంగా కలుసుకొనేవాళ్లం. అందులో ఐదారుగురు యువతులుకూడ ఉన్నారు. వాండ్లల్లో ఒకామె ప్రత్యేకంగా ఉండేది. రూపులో, చేష్టలలోకూడ నాయకత్వం వహించేది. వచ్చిన ఆంధ్రులలో 'బి.ఎ' వరకు చదివనవారెవరూలేరు. నేను ఒకణ్ణే కావడాన నన్ను ప్రత్యేకంగా చూచేవారు. నాయకత్వం వహించేదని చెప్పానే, ఆమె అందం విషయం మన కనవసరంగాని మనిషిలో ఏదో అవ్యక్త, గంభీరత ఆకర్షణ వుండేదిరా..." అని ఆగాడు శేఖర్, ఏదో ఆలోచిస్తూ.

"ఏరా, శేఖర్ ఆగావు ఆమె పేరేమిటో చెప్పకుండానే, ఆమె ప్రత్యేకతను, ఏ కరువు పెట్టేస్తున్నావు సరిగా చెప్పరా అన్నీ..." అంతలో శేఖర్,

"అందరూ ఆమెను 'అక్కా' అని పిలిచేవారు తర్వాత తెల్సుకున్నా, ఆమెపేరు "జానకి" అని. మనకు తరచు వినిపిస్తుండే పేరేలే-పేరు తగ్గట్టుగానే, అలనాటి రామాయణంలోని జానకిని గుర్తుకుతెచ్చేది-అందంకంటే ఆకర్షణఉండేది. ఇలా మొదటివారం గడచిన తర్వాత, ఒకరోజు నేను బసచేస్తున్న గదిదగ్గర కొచ్చింది నాపేరామెకు తెలీదు కాబోలు-నన్ను వర్ణిస్తూ ప్రశ్నిస్తూంది. బయట ఎవరో నన్నేనని నేను తెలిసికూడా ఉపేక్షించాను. ఎందుకు వచ్చివుంటుందా? అనుకుంటూ విచారించి లోపలికి రానే వచ్చింది చేసేదిలేక ఆహ్వానించాను. చాలా సాఫీగా, గంభీరంగా నిర్భయంగా కూర్చుంది, మాట్లాడింది. నా విషయాల నన్నిటిని తెలిసికొని నాటిచర్చల విషయమై చాలసేపు ప్రస్తావించింది అది. "స్త్రీలకు ఆర్థిక స్వాతంత్ర్యము" అనే విషయంమీద. తెలిసినాకూడా, నేనేమీ జాబివ్వలేకపోయాను చెమటపోసి పోతూంది- ఆమె ఎపుడు వెళ్ళిపోతుందా? అని అనుకుంటూ కాని ఆమె మాత్రం దాదాపు అర్ధరాత్రివరకూ, ఎవేవో చాలా కబుర్లు వినిపించి, సెలవు తీసుకొని వెళ్ళిపోయింది. ఇక నా కారాత్రి నిద్రలేదు-ఎడతెగని ఆలోచన- స్త్రీలనుకూర్చి ఇదివరకున్న నా అభిప్రాయాల్ని మార్చుకొనవలసిన అవుసరం కలి

గింది-గతంలోవున్న దురభిప్రాయాల్ని మార్చుకోడానికి ప్రయత్నించాను. స్త్రీలలోకూడ ఇంత సాధు ప్రవర్తను లుంటారా? అని నాలో నేను తర్కించుకున్నాను. గమ్యంచేరే మాదిరినే నా రాత్రి, ఆ భావపరంపరల్లో......" శేఖర్ చెప్పుకుపోతూంటే, ఇద్దరూ టైమ్ మర్చిపోయారు. దూరాన్నుంచి 'లైట్‌హౌస్' కాంతి వాండ్లమీదకు వచ్చేవరకు ఈ జగత్తులోలేరు. శంకరం స్తబ్ధుడై వింటూనే ఉన్నాడు. ఎదురు ప్రశ్నలు వేయాలనిలేదు. శేఖర్ కథనువింటూ తన్ను తాను మర్చిపోయాడు శంకరం. మళ్ళీ మొదలెట్టాడిలా శేఖర్.

"అలాగే అక్కడున్న మిగతా రోజులలో తరచు నన్ను కలుసుకొనేది పరిచయం, స్నేహంగా మారి రోజూ చూచుకోవాలనే వాంఛనాలో రేకెత్తింది ఆమె వివరాలు తెలిసికొనేందుకు జంకేవాణ్ణి ఆమె ఏమనుకుంటుందనే సందేహంతో. నాలోమాత్రం ప్రత్యేకంగా, ఏ భావాలు రూపొందలేదప్పట్లో. నిర్ణీత కాలంలో సభలుముగిసాయి. వీడ్కోలు, సమావేశం, పోటీ ముగిసాయి. మిత్రులందరం ఒకరునొకరు సెలవు తీసుకొని ఒకరి అడ్రస్‌లు-ఇంకొకరం మార్చుకొన్నాం-విడిపోయాం అందరం. నేను మాత్రం ఆమెనుండి విడిపోవడానికి చాలా బాధపడ్డాను. సెలవులు గదూ మా వూరు చేరాను. "బి. ఏ." ఫలితాలొచ్చాయి మామూలుగానే పాసయాను. మా నాన్న వాండ్ల బలవంతంగా, ఈ "యం. బి.బి. యస్" కి అప్లైచేసాను. అకస్మాత్తుగా సీటు వచ్చింది. ఇంట్లో అందరికీ నేను డాక్టరు కావడం ఆనందంగానే వుంది నాకుకూడా ఈ లోపుగా ఆమెవద్దనుండి లేఖ వచ్చింది చాల ముక్త సరిగా వుంది. మళ్లీ నాలో పరోభావావేశాలు కలిగాయి. ఇప్పటికీ జ్ఞాపకం "మాయ మర్మములేని నేస్తం, మగువలకు మగవారి కొక్కటే, బ్రతుకు తెరువుకు రాజమార్గం"...అంటూ వ్రాసింది. ఎంత బావుందంటావురా? వెంటనే నా సీటు విషయం తెలియపర్చి మద్రాసు పోగానే మళ్ళీ జాబు వ్రాస్తానని తిరుగు జాబిచ్చాను సకాలంలోనే వచ్చిన తర్వాత మళ్ళీ నా అడ్రస్ తెలియపరుస్తూ లేఖ వ్రాశాను. అప్పటినుండే మనమిద్దరం సహాధ్యాయులం, స్నేహితులం, వచ్చిన నెలరోజులలోనే ఆగస్టు 15 ప్రథమ స్వాతంత్ర్యోత్సవం జరుపుకొన్నాం, మన కాలేజీలో — ఇలా రెండుసంవత్సరాలు గడిచాయి, ఐతే ఆమధ్యలో మళ్లీ కలుసుకొనే సందర్భం, అవకాశం కలగలేదు. నా భావాలు ఆశయాలైనాయి. ఆమె వద్దనుండి లేఖ రాకపోతే బాధపడేవాడిని. ఆలస్యంగా వస్తే నిరుత్సాహి నయ్యేవాడ్ని. మనుషులం కలియకపోయినా, ఉత్తరాలమూలాన మే మెంత మనసుకు దగ్గరకు చేరుకున్నామో తెలుసుకోగలిగాను. ఉత్తరాల ప్రభావం అర్థమయింది. అనేక సాంఘిక, ఆర్థిక విషయాలు నన్నడిగి జాబులు మూలకంగా తెలుసుకొనేది. నేనప్పుడప్పుడు వ్రాస్తున్న కథల్ని పత్రికలలో చూచి తన అనుభూతుల్ని తెలియపరచేది. మళ్ళీ వేసవి సెలవులొచ్చాయి. సెలవులలో చూడాలని అమితమైన కోర్కె కలిగింది. కాని ఏమిటోగాని, ఆమె రమ్మనకముందే నేనే వెళ్ళడం ఎలా? అనే అభిమానం స్వాతిశయంతో కూడిన సంశయం రేకెత్తేది. అయితే నా ఆతురతను నా సంశయాన్ని ఆమెకు తెలియజేసే దెలాగని సరే, ఆమెనే మా ఇంటికి రమ్మంటూ లేఖ వ్రాశాను. త్వరలోనే జాబొచ్చింది సంఘంలో ప్రస్తుతం స్త్రీకున్న హద్దుల్ని వాటిని పాటించవలసిన బాధ్యతలనుకూడా ప్రత్యేకంగా పేర్కొంటూ నన్ను రావలసినదిగా కోరింది. నాకు బాగా జ్ఞాపకం జూన్ నెల మొదటివారం ఎండలు ఎక్కువ కాస్తున్నాయ్ రోహిణీ మాసంకూడా కదూ. ఆంధ్రదేశ కోస్తా జిల్లాలలో కమ్యూనిస్టుల హడావుడి జాస్తిగావున్న రోజులవి. ఆమె ఇచ్చిన అడ్రస్ ప్రకారం ఎలాగయితేనేం సాయంకాలం ఎనిమిదిగంటలకు వారింటికి చేరుకున్నాను. నన్నంతా సక్రమంగా ఆదరించారు వారింట్లో అందరికీ పరిచయం చేసింది. పరిచయాన్ని బట్టి చూస్తే నా విషయాన్ని నన్ను గురించి వారింట్లో అంతకుముందే చెప్పినట్లుగా నేను గ్రహించాను. దాదాపు నాలుగురోజులున్నా ఎన్నో విషయాలు చర్చించుకున్నాం. అయితే నాలోని నా ఆశాసౌధభావ సముచ్ఛయాన్ని ఆమెముందు ఎలా ప్రదర్శించాలో అర్థమయేది కాదు. అపసవ్యంగా

ఏమైనా ప్రవర్తిస్తున్నానా అనుకొనేవాడిని- ఏదో అవ్యక్త పరాధీనత, నిరుత్సాహంతో చరించేవాడిని- ఆమె దీన్నంతా గ్రహించింది. ఇంతక్రితం ఉత్తరాలలో, నేను వ్యక్తపరుస్తూ ఉన్న భావాలు ఆమెకు తెలుసుకదూ. ఒకనాటిరాత్రి నాలోని అసంతృప్తికి, నిరుత్సాహానికి కారణమేమిటంటూ, దానికేమైనా మార్గం ఉంటే ప్రయత్నిద్దామని ప్రశ్నిస్తూ అడిగింది. సమాధానం సమస్య అన్నీ మీరే అన్నాను- ఎలాగో మనసు చిక్కబట్టుకొని. అంతే ఆమె మాటలేకపోయింది. ఎందుకో కనుకొనకుల్లో జలబిందువులువచ్చాయి. నాకు ఆశ్చర్యం, విషాదం పెనవేసుకొని నాపైనాకే అసహ్యం, ఆగ్రహం కలిగింది. ఎంతసేపు ప్రశ్నించినా సమాధానంలేదు - ఎంతో ఓదార్చాను. చివరకు తెప్పరిల్లి గద్గదకంఠంతో ఇలా పలికింది, "ఏమండీ! మీరు చెప్పదలచుకొన్న భావం అర్థమయింది. ఇలాజరుగుతుందని కలలో కూడ ఊహించలేదు. వింటుంటే ఎక్కడో మానససరోవర తీరాల్లో, విహరిస్తున్నట్లుంది. కాని కొంచెం భవిష్యత్‌ను తలుచుకుంటే హృదయం బద్దలయిపోతూంది. మీరీ నిర్ణయం చేసుకోవడం నాకాహ్లాదమే. నాకొచ్చే ఆనందంకంటే మీకొచ్చేతలవంపులు తలచుకుంటే భయంగావుంది. నా విషయం మీకు తెలయదు. వింటే మనసు మార్చుకోగలరనుకుంటా బహుశా. మీకు జ్ఞాపకముందో లేదో ఆగస్టు విప్లవంలో నాకు వివాహమయింది రెండు వసంతాలనంతరం, నన్ను తల్లినిచేసి నా భర్తగారు గతించారు. అయితే తర్వాత పాపకూడా కాలకింకరుల కాహుతిఅయింది. ఇలా ఏకాకినై సాంఘిక, రాజకీయ జీవితాన్ని గడపదలచుకున్నాను. సాహిత్యాభిరుచి పెంచుకున్నాను. ఈ జీవితఘట్టంలో మీతో స్నేహమయింది. మిగతావిషయం మీకు తెలిసినదే..."అంటూ భారంగా ముగించిందామె. అయితే ఏమిటోగాని నా గత నిర్ణయభావాన్ని మార్చుకోవలయునని అనిపించనేలేదు-మళ్ళా నా నిర్ణయాన్ని తెలియపర్చాను. ఇలా తెల్లవారిందా రాత్రి-వాళ్ళ గ్రామంలో- మా మొదటి సమావేశంలో-కొత్త అనుభూతుల్లో.

ఏమిటో చెప్పుకుపోతున్నాడు శేఖర్. ఇలా సాగుతూంటే వాళ్ళకక్కడే తెల్లవారేటట్లుంది.

"అలా నిర్లిప్త ఉదాసీనతాధారంతోనే తిరిగి చేరుకున్నా నింటికి. నాలో మానసిక సంక్షోభం ఎక్కువయింది. ఆలోచన ఇనుమడించింది. ఆమె యెందుకు అంగీకరించలేకపోతుందో, విపులీకరించలేకపోయింది. గమ్యంచేరేదెలా? అనే ఆయోమయ స్థితిలో ఉన్న పరిస్థితిలో ఆమె దగ్గరనుండి ఒక సుదీర్ఘమైన లేఖ వచ్చింది. "ఇంత పెద్దలేఖ వ్రాస్తున్నందుకు క్షమించండి. నిజంగా మీ భావాన్ని, అభిప్రాయాన్ని విన్నాక నన్ను మీకు విపులీకరించవలసిన అవుసరం ఉందనుకుంటాను. మీకంటే నాకీ జగత్తులో ప్రియమైనదేదీలేదు. కాని నేను మీకీ సమస్యలో సహాయం చేయలేకపోయినందుకు మన్నించండి. నాకసలు మళ్ళీ సంసారిక జీవనసాగరంలో అడుగిడాలనిలేదు. అన్నిటికంటేమించి మీకూ, నాకూ మధ్య ఉన్న అంతరాలు, అవాంతరాలు-మీకెంతో భవిష్యత్ ఉంది. నేనా వాడిపోయిన పుష్పాన్ని. ఇలాంటి విపరీత కోణాల్లో, సంఘంలో మనం ఈదలేము. నిరంతరం మనం వాటిని ఎదుర్కోడానికే సరిపోతుంది, ఇక కలిస్తే పొందే ఆనందమేమిటి చెప్పండి? కాబట్టిమీరా అభిప్రాయాన్ని మార్చుకొని మన స్నేహాన్ని పరస్పర ప్రేమాభిమానాలలాగే కొనసాగనివ్వండి. 'మిలన్ అంత్ హై మధుర్ ప్రేమ్ కా...' అన్న మాటలు జ్ఞాపకముంచుకోండి. వ్యర్థ ఆలోచనలతో చదువు పాడుచేసుకోబోకండి-శెలవు, మీ జానకి." ఇది ఆ లేఖ సారాంశం. ఆమె ఎంతసేపు చెప్పినా, సంఘంకట్టుబాట్లు, తనలోని అసహాయతత్వాన్ని పేర్కొంటుందేకాని, తనకిష్టంలేదంటే ఒక్కమాటతో పోదా? అని పరిపరివిధాల వ్యర్థంగా ఆలోచించేవాడిని..." అంతలో శంకరం అందుకొని,

"శేఖర్ నేనొకటి చెప్తాను. జానకికి నీమీద వున్న అయిష్టతను, పాపం నీముందు బహిర్గతం చేయలేకపోతుందేమోఎప్పుడైనావిచారించావా?"

"నీవన్నది నాకర్థమయింది శంకర్. కాని ఏమిటో అప్పట్లో అన్నిటిని మరిచిపోయేవాడిని. ఆత్మాభిమానం కూడా నశించింది. ఏమిటో ఆమెను నా జీవిత సహధర్మచారిణిగా స్వీకరిస్తే

ఆనందపు టంచులు, అనురాగపు లోతుల వరకూ, పయనించగలననే నమ్మకముండేది. ఆ నమ్మకం కాదు విశ్వాసంతోనే ఇలా జాబు వ్రాశాను. "సంఘంలో ఉండే అడ్డంకుల నెదుర్కోవడం లోనే ఆనందంఉన్నదని, కష్టాల నెదుర్కోవడమే జీవితమని మనం ఓర్పుతో, సహనశీలంలో ప్రవర్తించడమూ, నిర్మాణాత్మకంగా యోచించడమూ అలవరచుకుంటె, మన భవిష్యత్ ఆందోళనా విరహితం కాకపోయినా, ఆశా పూరితం మాత్రం కాక తప్పదంటూ" కూడా వేర్కొన్నాను. ఇలా ఎన్ని రోజులయినా, ఆమె మనోగతాభిప్రాయాల్ని తెలుసుకోనేందుకవకాశ మిచ్చేదికాదు-అలాంటి ఆలోచనలతోనే నాకా మార్చిలో "ఎనాటమీ"లో పోయింది. తర్వాత డిసెంబర్‌లో పూర్తిచేసిన విషయం నీకు తెలుసుగా-ఇలా ఏమిటీ అప్పట్లో "జీవిత మొక మసిపూసిన వదనం, అఖండ భయ సదనం"గా గోచరించేది-జీవిత మొక ఎడతెగని పోరాటంగా ఊహించేవాణ్ణి-శంకరం, నిజంగా మానవుని జీవితయానంలో స్త్రీ పాత్ర యెంత విలువయిందో అర్థమయింది. ప్రత్యేకంగా యౌవనదశలో ఉన్నప్పుడు మరీ, అవకాశాలు, అవసరాలు-ఉద్భృతాలై, పౌర్ణమినాటి సాగరంలో అఖండ నిశీథంలోని లేచే అలల్లా పెల్లుబికేవి" అంతలో శంకరం అందుకొని-

"నీవు చెప్పినదంతా సత్యమే కాని, మన జీవితయానంలో ఎందరో వ్యక్తులు తారసపడుతూంటూరు, అందరినీ హృదయంలో ఇముడ్చుకోవాలని ప్రయత్నించడం శుద్ధ పొరపాటు-తెలివితక్కువ కూడా నేమో..." అని ముగించాను.

"శంకర్, నీవు చెప్పిన మాటలు అంగీకరించవలసిందే-కాని ఏ కొందరో వ్యక్తులు, కొన్ని సమయాల్లో, అప్రయత్నంగానే ప్రత్యేక స్థానా న్నాక్రమించుకుంటారు మనలో-నిజంగా అప్పటికి జానకి నాలో ఒక ప్రతేక స్థానాన్ని ఆక్రమించుకుంది-అయితే ఆమెలో నే నేమైనా 'స్థానాన్ని' ఆక్రమించుకోగలిగానా? పరీక్షకందని సమస్య, ప్రశ్న కూడా-పాపం అప్పటి నుండీ, నా క్షేమం-చదువులు జాగ్రతంటూ మళ్లీ ఆమె నా లేఖలకొరకు ఎదురుచూసి, విసుగెత్తి, అన్యధా భావిస్తుందేమోనని కలిగేది నాలో. ఆ విషయం ప్రస్తావించడం మానివేశాను. ఇక నాలోనే అణుచుకోడానికి ప్రయత్నం అప్పటి నుండే. నాన్నవాండ్లపు డప్పుడు, నా వివాహ విషయమై ప్రస్తావించేవారు-చదువు పూర్తికావాలని కొంతె సాకుతో ఇప్పటివరకూ కొనసాగిపోయింది. జానకి నుట్టురు మహిళోద్యమంలో పాల్గొంటుందని విన్నాను. ఈ మధ్యలో కథలు కూడా వ్రాస్తూంది. సాహిత్యాభిలాషిణయిందని కూడ తెలుసుకున్నాను. ఎక్కడో 'అభ్యుదయ రచయితల' సంఘానికి కార్యదర్శిగా ఎన్నికయిందట - మాశావా - వీటన్నింటికి నేనే కారణమంటూ, కృతజ్ఞత తెల్పుతూ, చాల పుస్తకాలు బహుమతి పంపించింది. ఇలా మూడు సంవత్సరాలు గడిచాయి-పోయిన మార్చిలోనే మన చదువు పూర్తయింది. మళ్ళీ పోయిన శెలవులో కలుసుకోవడం తటస్థించింది. ఆగస్టు మాసంలో అనుకుంటాను. మనకింకా అప్పటికి ఆంధ్రరాష్ట్రం రాలేదులే-నిజంగా. ఆమెలోకన్నా, నాలోనే ఎక్కువ మార్పులు వచ్చినయ్ శారీరకంగా, మానసికంగా కూడా-ఆమె అలానే ఉంది. ఈ కలయిక చాలా, మౌనంలోనే గడిపాం ఇద్దరం-వొకరినొకరం సరిగా నిష్కల్మషంగా చూచుకోలేక పోయేవాళ్లం - నే నేదో నేరస్థ హృదయుడిలా బాధపడేవాణ్ణి. ఆమె అలాగా ప్రవర్తించేది-నాలో భావాన్ని మాత్రం గ్రహించిదామె. అలాంటి వాతావరణంలోకే ఇద్దరం సినిమాకు వెళ్లాం. నాకేమిటో వొంటరిగా వుంటుంటే బాగుండేదా రోజుల్లో, నవ్వలేక పోయేవాణ్ణి. భౌతిక కార్యక్రమాలు మాత్రం సక్రమంగా సాగిపోతుండేవి-ఇద్దం సినిమా చూచి తిరిగివచ్చాం, మౌనంలోనే - సినిమా చూచిన తర్వాత ఆమెలో కొంత క్రొత్తమార్పుని గ్రహించాను — విషాదచ్ఛాయలు ప్రస్ఫుటమయ్యాయి. ఆమె వదనంలో కొంచెం బాధాతప్తత కూడ గోచరించింది అడిగాను... "మీరుమాత్రం, నేను మీ జీవిత సహపాఠిగా సహకరించనంతమాత్రాన దేవదాసులా కాకూడదు, నాకు మాట ఇవ్వండి" అంటూ జవాబుగా పల్కిందామాటలు,ఎక్కడో అగాధంలో-చిన్నగా నవ్వాను-అప్రయత్నంగా.

ఇక ఆమె ఏన్నో విధాల పలుకరిస్తూ కాలక్షేపం చేసేది-నా మౌనానికి భయపడేది జానకి. ఇలా మళ్ళీ విడిపోయాం మళ్ళీ - కలుసుకోవాలని కుతూహలం కాని, కలుసుకొని విడిపోయినతర్వాత పడే బాధ తలుచుకుంటే. అసలా సంధ్యా కాలంలో ప్రేమికులు కలియడమంత మంచిది కాదేమో ననిపిస్తుందిప్పుడు. ఆమెవద్దనుంచి మళ్ళీ "మీరు, గత స్మృతుల్ని మర్చిపోయి, భవిష్యత్ ఉజ్జ్వలంగా గడపడానికి ప్రయత్నించండి" ఇదీ దాని తాత్పర్యం—ఆ ఉత్తరం, అర్థం - భావం కూడా - ఎలా మర్చిపోయేది శంకరం?-మనం మనుషులం, తలవుంది - అందులో మెదడు వుంది జ్ఞాపక ముంచుకొనే స్వభావం దానిగుణం. అదే ఒక యంత్రంమాదిరి అయినట్లయితే, బూజు, దుమ్ము దులిపినట్లు గత స్మృతుల్ని దులిపి శుభ్రం చేసి, మళ్ళీ యథాస్థానంలో పెట్టుకోవచ్చు. కాని అది సాధ్యం కాదుగా. అసలు మరిచిపోడానికి ప్రయత్నమంటేనే వణికిపోయే వాడిని, హృదయ కంపనంకూడ పెరిగేది. ఇలా కొద్ది రోజులు గడిపాను. అందుకనే నాలో నిర్మలత పోయి, అలజడి వచ్చినట్లు నీవు తెలుసుకున్నావ్ పైకి వీటన్నిటికీ అతీతంగా ఉండాలని ప్రయత్నించే వాడిని, ఈ విషయం ఎవరితో చెప్పుకోడానికి మనస్కరించేది కాదు. ఈనాటికి నా బరువు కొంత ఉపశమించింది. వీటన్నింటితో ఎలాగయితేనేం చదువు పూర్తిచేశాను. ఇంకా కొద్ది నెలల్లో ఈ "హౌస్ సర్జన్"గా కూడా ముగుస్తుంది. అంతా యంత్రంలా గడుపుతున్నాను అరే, అసలు విషయం మరచాను. ఇలా ఉన్న పరిస్థితులలోనే, నీకు జ్ఞాపకముందిగా మన 'క్లాస్ మెట్' "సుశీల" పాపం చాలా మంచిది. మంచితనం కంటే ఫ్రేంక్‌గా ఉండేదన్నమాట నిజం-నాతో మొదటినుంచీ ప్రత్యేక స్నేహంకోసం తహ, తహలాడేది- ఇవన్నీ నీకూ, మన కాలేజీలో అందరికీ తెలిసినదే-నేను కాదనలేకపోయేవాడిని. ఆమె చెప్పినట్లుగానే ప్రవర్తించేవాడిని-కాని, ఏమిటో సహాధ్యాయినిగానే మాత్రం వ్యవహరించే వాడిని-చివరకు నామీద ఆమెకున్న అభిప్రాయాన్ని తెలుసుకొని నాలో నేను బాధ పడ్డాను. నేరం చేస్తున్నానేమో ననిపించేది. పాపం సుశీలకు సహాయం చేయలేక పోతున్నాననే అసహాయత వెన్నంటేది. పాపం నా విషయం, ఆమెకు తెలీదు. సుశీల నిష్కల్మషి-నిజంగానున్యమప్రకృతి. విచిత్రంగా, హృదయమంతా వికసింపచేసి మకరందాన్ని ఆస్వాదించమని ఆహ్వానించే మధుమాలతిని కాలన్ని, ముకుళిత మల్లెమొగ్గ చుట్టూ విహరిస్తుందట గండుతుమ్మెద. ఏమిటో యీ ప్రకృతి వైపరీత్యం" అంటూ శేఖర్ తనలో తాను నవ్వుతున్నాడు. అంతలో శంకర్ ఏదో డిస్కవర్ చేసినవాడిలా చిరునవ్వుతో, "జానకి నీకు కావాలి, సుశీలకు నీవు కావాలి, జానకి నీకు సహాయం చేయలేదు, సుశీలకు నీవు సహాయం చేయలేవు. అంతా చాలా బాగుందిరా, శరత్ నవలలా. ఐతే మీ జానకి విషయం ఆలోచిస్తూ ఉంటే ప్రియబాంధవిలోని కథాయిక జ్ఞాపకమొస్తుందిరా. అసలు స్త్రీ ప్రకృతే అంతేరా! పురుషుడిలో ఆశలు, ఆశయాలు రేకెత్తిస్తుంది. క్రమంగా నిరాశ నిస్పృహలను ప్రబలింపచేస్తుంది-జీవితాన్ని హాలాహాలం అమృతంచేసేవాండ్లు స్త్రీలేరా" అంటూ ముగించాడు శంకరం.

"అయితే జీవనంతా స్వార్థంతో అంటున్నానని నీవనవచ్చు. స్వార్థరహితమేమున్నదిరా శంకర్? ప్రకృతి అంతా స్వార్థం- స్వార్థంలోనుండే ఈ ప్రస్తుత ప్రపంచోద్భవం-మానవాభివృద్ధి. అదలా వుండనీయ్-కొద్దిరోజులక్రితమే ఒక నిర్ణయం చేసుకున్నానురా శంకరం" అంటూ ఇంకా ఇలా కొనసాగించాడు శేఖర్ తన గాథను. "అంతకంటే నాకితరమార్గం గోచరం కాలేదు, అదే ధ్యేయమనిపిస్తోంది. బహుశా నీకది విరుద్ధంగా కనపడవచ్చు. దాన్ని 'సెంటిమెంటల్' అన్నా అంగీకరిస్తాను నేను. జానకి ఏకాంతజీవనంలో స్వేచ్ఛాపథానికి నేను బలవంతంగా అడ్డుపోకుండా నాస్థితినిలాగే కొనసాగించుకుంటూ, నేనుకూడా ఏకాకిగా, సంఘానికి చేయగల సేవచేస్తూ జీవితం గడుపుదామని. ఏమిటోగాని శంకర్ ఒకటడుగుతాను చెప్తావ్? జీవితానికున్న స్వల్పకాలంలో అనుకున్న ఆశయాలు సిద్ధించకపోయినపుడు మనకింకో మార్గమేముందిరా! నేనింకెవ్వరినీ స్వీకరించలేనట్లు చేసింది జానకి. కాని ఆమెనన్నా స్వీకరించలేదు. అందుకనే ఆ నిర్ణయం, పోయిన నూతన సంవ

త్సరాదినాడు స్వీకరించాను ప్రతిజ్ఞలా..." అంటుండగానే, ఇంతవరకూ ఓర్పుతో విన్న శంకరం హఠాత్తుగా...

"పోరా శేఖర్, నీవు స్త్రీ లేకుండా ఏకాకిగా సంఘానికి సేవచేయడం నేనంతగా అంగీకరించను. అసలు కొందరు స్త్రీ, పురుషులు వొంటరిగా సంఘానికి సేవచేస్తామనే వాళ్ళను నేను సహించనురా, కారణాలు, పరిసరాలలో ఎంత ప్రభావమున్నాసరే. నీవు బ్రహ్మచారిగా బ్రతకడం నేను సుతరామూ వప్పుకోలేను, అలా వుండవలసిన అవసరం కూడా లేదు. పైగా, జీవితంకోసం ప్రేమ కాని, ప్రేమకోసం జీవితాన్ని బలిచెయ్యడము కర్తవ్యానికి దూరం కావడమే. పైగా వొంటరిగా సంఘానికినీవు సక్రమమార్గంలో అభిలషణీయంగా సహాయం, సేవ చేయలేవు. నీకో సహాయకారి, సలహాదారు, నీజీవితనౌకకు చుక్కానిలా నడిపించేటందుకో స్త్రీ అవసరం- "ఏదో ఆశించాను, దాన్ని పొందలేకపోయాను. అందుకని ఇక దేనినీ స్వీకరించలేననీ. నీ వేదాంతాన్ని సతరామూ వినలేనురా - చివరకు నే నిచ్చేసలహా ఏమిటో విన్నావా - పైగా నీవూ చెప్పావు, నాకూ తెలుసు, మనక్లాస్మేటు సుశీల విషయం. ఆమె నిన్న ఎంతగానో కాంక్షిస్తుంది - నిన్న అన్నివిధాలా పూజిస్తూ, అనురాగంతో మెలుగుతుంది. పోతే, నీవామెను స్వీకరిస్తే ఆమె జీవితంలో నవవసంతాల్ని విరజిమ్మినవాడవవుతావు. నీ వామెను స్వీకరించకపోతే ఆమెజీవితం అంతసుగమ్యంకాదు. నీవు సుశీలకోసం, నీ గతస్మృతుల్ని, తదనుగుణ నిర్ణయాన్ని త్యాగం చెయ్యాలి. నీవు జానకి ఏకాంతస్వేచ్ఛాజీవనానికి నీ భవిష్యత్తుత్యాగం చేస్తానన్నావు. అలా చేయడంద్వారా నీవైతే వ్యక్తిగతంగా హాయిని పొందినా, అటు మీజానకి, ఇటు సుశీల యిద్దరూ సుఖపడరు. కాబట్టి నీ త్యాగాన్ని, సుశీలను స్వీకరించడంలో ఉపయోగించి, నీ భవిష్యత్ జీవనాన్ని హాయిగా గడపడానికి ప్రయత్నించు. సుశీల నీ వృత్తిలోకూడ చేదోడు వాదోడుగా వుండి, ఇతరులకు మచ్చుగా మీరు మీ జీవనాన్ని గడపవచ్చునుకూడా. అయితే నీ గతాన్ని పూర్తిగా విస్మరించి, మర్చిపొమ్మనీగాదు - ఆ విషయం నాకూ తెలుసు, మరవడంకష్టం-హృదయగాయాన్ని మాన్పడానికి ప్రయత్నించినట్లే— అయితే నీ జీవితాన్ని ఆ ఆలోచనతో దుర్గంధం చేసుకోవద్దు. కనుక నీవు సుశీలను త్వరగా స్వీకరించు- బహుశా నీ విషయం, సుశీలను స్వీకరించిన తర్వాత—వింటే మీ జానకికూడ హర్షిస్తుంది— నా శేఖరం - సక్రమ మార్గంలో జీవించబోతున్నాడు గదా అని—దానితో ఆమెకుకూడ మానసికశాంతి. ఇలా అన్నికోణాల్లోనుంచి పరిశీలిస్తే - సుశీలను స్వీకరిస్తే వచ్చే వెల్గుకోణాలే ప్రబలంగా ఉన్నాయి. కనక నీవు నా అభిప్రాయంతో ఏకీభవించి తదనుగుణంగా ప్రవర్తిస్తావని ఆశిస్తున్నానురా శేఖర్" అంటూ బోధించాడు శంకరం. చాలసేపటికి తలవూపాడు శేఖర్ - సంధిగ్ధావస్థలోనే.

ఈ జీవితానుభూతి, శుష్క-ప్రియమైన శూన్యహస్తాలు చూపిస్తూ ఆశాశిఖరాలై - ఎండమావులై జీవితాల వ్యత్యాసాలతో పరిణామం చెంది నిట్టూర్పై - శేఖరానికొక మరువరాని విషాదామృతబిందువయింది.

---

ఇనాందారు చలికాలం మార్తాండమూర్తి జీవితం అంతా పల్లెటూరులోనే గడిపారు. బంధువెవరో ప్రోత్సహిస్తే లోగడ తన పేరిట పదివేలరూపాయలకి ఇన్సూరెన్సు పోలసీ ఒకటి తీసుకున్నారు. కొన్నాళ్ళకి కంపెనీకి ప్రీమియండబ్బు రావడం మానేసింది. మూడునోటీసులు యిచ్చినతరువాత వాటికి సమాధానం వచ్చింది. "మీ వాయిదాసొమ్ము కట్టలేనందుకు క్షమించండి. మార్తాండమూర్తిగారు పోయి మూడు సంవత్సరాలైంది—భార్య కమలమ్మ."